ది క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
17-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 115

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


హైదరాబాదులో ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన హోంవర్క్ వివాదం రాజకీయరంగు కులముకుంది. రెండో తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థికి ఇస్లామిక్ మతానికి సంబంధించిన కల్మా, సురా ఫాతిహా చదివి రావాలని హోం వర్క్ ఇవ్వడం ఇప్పుడు వివాదానికి కారణమైంది. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

## చిచ్చురేపిన 'హోంవర్క్' వివాదం!

### మతపరమైన అంశాలు బోధన


ఓ పాఠశాలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు

కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ ఘటన చిలికి చిలికి గాలి వానలా మారి రాజకీయ విమర్శలకు తావిస్తోంది.

- మిగతా 2వ పేజీలో




# కలహాల కాంగ్రెస్!

తెలంగాణలో అధికార కాంగ్రెస్ లో సమన్వయ లోపం రోజురోజుకు పెరుగుతోంది. గత కొంతకాలంగా పార్టీలో అంతర్గతంగా సాగుతున్న పరిణామాలు ఆ పార్టీని అస్తవ్యస్త పరిస్థితిలోకి నెట్టేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కనిపించిన జోష్ క్రమేపి తగ్గుతుంది. గాంధీభవన్ వేదికగా నిత్యం అంతర్గత విభేదాలు చోటు చేసుకుంటున్నాయి.

### తెలంగాణ అధికార పార్టీలో శృతిమిస్తున్న విభేదాలు

కట్టడి చేయలేకపోతున్న గాంధీభవన్ వర్గాలు

క్రమేపి తగ్గుతున్న హస్తం జోష్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**
పార్టీలో ఆధిపత్య పోరాటం ఢిల్లీలోని కాంగ్రెస్ హై కమాండ్ కు సరికొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెట్టారు. కానీ పార్టీ వ్యవహారాలను, విభిన్న వర్గాలను

- మిగతా 2వ పేజీలో

# మళ్లీ డి లిమిటేషన్ బిల్లు!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టేందుకు నిర్ణయం

పక్కా వ్యూహంతో కసరత్తు ప్రారంభించిన కేంద్రం

ఈసారి కచ్చితంగా ఆమోదం పొందే అవకాశం

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:
మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బలమైన చర్చ నడుస్తోంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొద్ది రోజుల కిందట మహిళా బిల్లుతోపాటు డీ లిమిటేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది కేంద్ర ప్రభుత్వం.

కానీ మూడింట రెండో వంతు మద్దతు లేకపోవడంతో మహిళా బిల్లు వీగిపోయింది. దీంతో డి లిమిటేషన్ బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరోసారి ఆ రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముంగిటకు తెచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 3వ పేజీలో



తెలంగాణలో మద్యం బాబులకు షాక్. అక్కడ మద్యం ధరలు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మద్యం ధరల పెంపుపై ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈనెల 17న ఆ కమిటీ సమావేశం జరగనుంది. మద్యం ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే మద్యం తయారీ సంస్థలు ప్రభుత్వానికి ధరల సవరణ కోసం అనేకసార్లు విజ్ఞప్తి చేశాయి.

## మందుబాబులకు షాక్!

తెలంగాణలో భారీగా పెరగనున్న మద్యం ధరలు

17న జరిగే సమావేశంలో కమిటీ కీలక నిర్ణయాలు



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**
ఈ క్రమంలోనే ధరల నిర్ణయం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. మద్యం ధరల పెంపు, కొత్త ధరల అమలు, బాటిల్స్

- మిగతా 2వ పేజీలో



## భోగాపురం నుంచి ఎగరనున్న విమానాలు!

నెల రోజుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం

పీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ముహూర్తం

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం పై

- మిగతా 3వ పేజీలో

## బిజెపి 'దళిత' వ్యూహం!

ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలపై గురి

ఆ సామాజిక వర్గ ఓట్లపై ఫోకస్

వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ

2లో

# ఏపీలో కూటమి ప్రభుత్వం భేష్!




బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కితాబు


ఢిల్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు

- మిగతా 2వ పేజీలో





# మందుబాబులకు షాక్!



(మొదటి పేజీ తరువాయి)

సైజ్ వంటి అనేక ముఖ్యమైన అంశాలపై చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

**ధర పెంచాలంటున్న తయారీదారులు..**

మద్యం తయారీ డిస్టలరీలకు మద్యం ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా వ్యయం బాగా పెరిగిన నేపథ్యంలో తయారీదారులు ధర పెంచాలని పట్టుబడుతున్నారు. ప్రస్తుత ధరలతో విక్రయాలు చేయడం కష్టంగా మారిందని.. అందుకే మద్యం ధరలు పెంచి ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే తాజాగా ఏర్పాటు అయిన కమిటీ కేవలం తయారీదారుల అభిప్రాయాలే కాకుండా.. అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఒకేసారి భారీగా ధరలు పెంచడం కంటే.. క్రమేపి ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**10 నుంచి 20 శాతం పెరుగుదల..**

అయితే ఈ కమిటీకి వచ్చిన నివేదికల ప్రకారం ప్రస్తుత ధరలపై పది నుంచి 20 శాతం పెంచే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కేవలం మద్యం ధరలే కాదు సీసాల సైజు విషయంలో కూడా ఒక నిర్ణయం తీసుకోనున్నారు. కొత్తగా 150 ఎమ్మెల్ సైజు బాటిల్స్ ప్రవేశపెట్టాలని తయారీ సంస్థల సూచనలు కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. మార్కెట్లో కొత్తగా వీటిని తీసుకురావడం, వినియోగదారులకు మరిన్ని ఎంపికలు చేసుకునే అవకాశం కల్పించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈనెల 17న జరగనున్న ఈ కమిటీ సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించి.. వినియోగదారులపై భారీగా భారం మోపకుండా తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కానీ మద్యం ధర పెరుగుదల అనేది అనివార్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు అయిన కమిటీ సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఆదాయం పెంచుకునేలా.. ఉత్పత్తి కంపెనీల సమస్యలు పరిష్కరించేలా.. మద్యం వినియోగదారులకు ఎక్కువ భారం కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## న్యూజిలాండ్‌లో భూ ప్రకంపనలు: సునామీ హెచ్చరికలు జారీ

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌లో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలు రేకెత్తించాయి. దక్షిణ ద్వీపంలోని టె అనౌ పట్టణ సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. టె అనౌకు ఉత్తరాన సుమారు 40 కిలోమీటర్ల(24.85 మైళ్ల) దూరంలో భూకంప కేంద్రం ఉందని న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే, జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ మాత్రం దీని తీవ్రతను 5.9గా వెల్లడించాయి. అలాగే భూమికి 50 కిలోమీటర్లకు పైగా లోతులో భూకంపం సంభవించినట్లు నిర్ధారించాయి.

# ఏపీలో కూటమి ప్రభుత్వం భేష్!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర రాజకీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పరస్పర విరుద్ధంగా వ్యవహరించే రాజకీయ పార్టీలు అనుకూల ప్రకటనలు చేస్తున్నాయి. గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పనితీరును ఆకాశానికి ఎత్తేసారు. ఎల్ నినో ముప్పు ముంచుకొస్తున్న కష్టకాలంలో ఏపీ సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అద్భుతం అంటూ ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో మీడియాతో జరిగిన ఒక చిట్ చాట్ సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ గా హాట్ టాపిక్ అవుతున్నాయి.

**పూర్తిగా భిన్న వాదనలు..**

సాధారణంగా గోదావరి జలాల తరలింపు, పట్టిసీమ ప్రాజెక్టులపై గతంలో రెండు రాష్ట్రాల మధ్య భిన్నమైన రాజకీయ వాదనలు వినిపించేవి.. కానీ ఇప్పుడు కేటీఆర్ ఏపీ ప్రభుత్వ జల వ్యూహాన్ని సమర్థించారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నప్పటికీ.. ఏపీలో రైతులకు నీటి కొరత రాకుండా అక్కడి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని కేటీఆర్ కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలోను పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తూ.. రైతు ప్రయోజనాలకు ఏపీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అభిప్రాయపడ్డారు. సముద్రంలో వృధాగా పోయే ప్రతి చుక్క నీటిని వాడుకునేందుకు ఏపీ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నిస్తోందని.. అక్కడి సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తుందన్న విషయాన్ని గుర్తు చేశారు. అదే సమయంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. ఏపీ ఇస్తున్న ప్రాధాన్యతలో కనీసం సగం కూడా ఇక్కడ రేవంత్ సర్కార్ ఇవ్వట్లేదని మండిపడ్డారు. గతంలో ఏపీ ప్రయోజనాలకు, చంద్రబాబు ప్రయోజనాలకు అనుగుణంగా రేవంత్ నడుచుకుంటున్నారు అని కేటీఆర్ ఆరోపించేవారు. కానీ ఇప్పుడు సడన్గా యూటర్న్ తీసుకోవడం విశేషం.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు..**

కాళేశ్వరం ప్రాజెక్ట్, మేడిగడ్డ బ్యారేజీ వివాదంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పై విరుచుకుపడ్డారు కేటీఆర్. నేషనల్ డ్యామ్స్ సేఫ్టీ అథారిటీ తీరు పూర్తిగా పక్షపాతంగా ఉందంటూ ధ్వజం ఎత్తారు. గతంలో ఏపీలో పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిన్నప్పుడు ఈ ఎన్ డి ఎస్ ఏ కంటికి కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. కానీ ఇప్పుడు మేడిగడ్డ పిల్లర్ స్వల్పంగా కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు అంటూ తప్పు పట్టారు. మేడి గడ్డపై ఇచ్చింది సాంకేతిక నివేదిక కాదని.. అది పూర్తిగా కేంద్రంలోని ఎన్డీఏ రాజకీయ నివేదికగా తేల్చి చెప్పారు. రెండు రోజులుగా ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు స్పష్టతనివ్వలేకపోయారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఇంజనీర్లు ఇచ్చిన అసలు నివేదికను ప్రభుత్వం ఎందుకు దాస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

**కాళేశ్వరం పై పగ..**

తెలంగాణలో రేవంత్ సర్కార్ పాలన గాలికి కొట్టుకుపోతోందని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేకుండా పోతుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు పై పగబట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్ పేరు తలవనిదే ఆయనకు పూట గడవడం లేదని ఎద్దేవా చేశారు. గత రెండేళ్ల కాలంలో కెసిఆర్ ఎవరిపైన వ్యక్తిగత విమర్శలు చేయలేని విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం దారుణం అన్నారు. తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి వసూళ్ల పర్వానికి దిగారని ఆరోపించారు. పక్క రాష్ట్రం రైతుల కోసం ప్రాజెక్టులు కడుతుంటే.. ఇక్కడ మాత్రం ఉన్న ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు కేటీఆర్. మొత్తానికైతే కేటీఆర్ నోట ఏపీలో కూటమి ప్రభుత్వానికి అనుకూల మాటలు రావడం విశేషం.

# కలహాల కాంగ్రెస్!

ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం ఆ పార్టీలో సంక్షోభం ముదురుతోంది. తెలంగాణలో అధికార కాంగ్రెస్ లో సమన్వయ లోపం రోజురోజుకు పెరుగుతోంది. గత కొంతకాలంగా పార్టీలో అంతర్గతంగా సాగుతున్న పరిణామాలు ఆ పార్టీని అస్తవ్యస్త పరిస్థితిలోకి నెట్టేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కనిపించిన జోష్ క్రమేపి తగ్గుతుంది. గాంధీభవన్ వేదికగా నిత్యం అంతర్గత విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలో ఆధిపత్య పోరాటం ఢిల్లీలోని కాంగ్రెస్ హై కమాండ్ కు సరికొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెట్టారు. కానీ పార్టీ వ్యవహారాలను, విభిన్న వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం ఆ పార్టీలో సంక్షోభం ముదురుతోంది.

**నోటికి పని చెబుతున్న నేతలు..**

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు ఇప్పుడు బయటకు వస్తున్నారు. నోటికి పని చెబుతున్నారు. రేణుకా చౌదరి లాంటి ఫైర్ బ్రాండ్ నేతలు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి చేటు తెస్తున్నాయి. తమ సొంత వర్గ ప్రాధాన్యతల కోసం పట్టుబడుతున్న తీరు పార్టీ క్యాడర్ను గందరగోళంలోకి నడుస్తుంది. ఒకవైపు ప్రభుత్వం నిర్ణయాలను సమర్థిస్తూనే.. మరోవైపు పార్టీలో తనకు దక్కాల్సిన ప్రాధాన్యతపై సీనియర్లు బహిరంగంగానే అసంతృప్తి వెళ్ళగక్కుతున్నారు. ఈ అంతర్గత వర్గ పోరాటం భారత రాష్ట్ర సమితి తో పాటు భారతీయ జనతా పార్టీకి ఆయుధాలుగా మారుతున్నాయి. గాంధీభవన్లో క్రమశిక్షణ అనేది క్రమేపి తగ్గుతుండడం నేతల ఇష్టా రాజ్యానికి కారణం అవుతోంది. ఇటీవల తుంగతుర్తి ఘటన కాంగ్రెస్ పార్టీలో మారిన పరిస్థితికి అర్థం పడుతోంది.

**నిమిత్తమాత్రుడిగా సారథి..**

తెలంగాణలో కాంగ్రెస్ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అనుకున్న స్థాయిలో పనిచేయడం లేదు. ఆయన కేవలం నిమిత్తమాత్రుడిగా మిగిలిపోతున్నారన్న టాక్ ఉంది. దీంతో పార్టీలో సీనియర్లు, అసంతృప్తివాదులు రెచ్చిపోతున్నారు. మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షుడిగా అందరినీ కలుపు కెల్లడం లేదన్న విమర్శ ఉంది. ఏదైనా వివాదం తలెత్తితే దానిని గుర్తించి పరిష్కరించడం లేదు. దీంతో అది రోజు రోజుకు పెద్దదై పార్టీని చికాకులో పెడుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో చర్యలు లేకపోవడంతో నేతలు నోటికి పని చెబుతున్నారు. ముఖ్యంగా వివాదాస్పద నేతలు పార్టీని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇబ్బందుల్లో పడినట్టే.

### చేతులెత్తేసిన మీనాక్షి నటరాజన్..

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జిగా మీనాక్షి నటరాజన్ ఉన్నారు. ఆమె అప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నారు కానీ ఫలితం లేకపోతోంది. ఇక్కడి గ్రూపు రాజకీయాలను సర్ది చెప్పలేక చేతులెత్తేసిన పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ లో ప్రధానంగా సీనియర్లకు, జూనియర్లకు మధ్య అగాధం ఏర్పడుతోంది. దానిని పూడ్చడం ఆమె సాధ్యం కావడం లేదు. ఇదే సమయంలో నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అయితే తెలంగాణ పంచాయతీలో చివరకు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ పదవి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు ఆమె నియంత్రణ దాటి వెళ్లిపోయిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# చిచ్చురేపిన 'హోంవర్క్' వివాదం!



దీనిపై బిజెపి సీనియర్ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. తీవ్ర విమర్శలు కూడా చేశారు.

**ఫాతిహా చదవాలని..:**

హైదరాబాదులోని సైదాబాద్ లో సక్సెస్ స్కూల్ ఉంది. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి స్కూల్ డైరీలో దీనియాత్ సబ్జెక్టు కింద సుర ఫాతిహా చదవాలని హోంవర్క్ ఇచ్చారు. అంతకుముందు కూడా కల్మా చదవాలని రాసి ఇచ్చారు. అయితే సదరు విద్యార్థి ముస్లిం కాదని.. హిందువు అని గుర్తించి ఆ హోంవర్క్ ను కొట్టేశారు. అయితే ఇదే విషయం విద్యార్థి తల్లిదండ్రులకు తెలియడంతో వారు యాజమాన్యాన్ని కలిసి తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ పిల్లలకు మతపరమైన పాఠాలను ఎందుకు బోధిస్తున్నారని ప్రశ్నించారు. అయితే స్కూల్ నిబంధనల ప్రకారమే హోంవర్క్ ఇచ్చినట్లు సదరు ఉపాధ్యాయులు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు బిజెపి నేతలను ఆశ్రయించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ కూడా కొనసాగించారు. వెంటనే సదరు సక్సెస్ స్కూల్ యాజమాన్యం స్పందించింది. అది ఆ టీచర్ చేసిన పొరపాటుగా పేర్కొంది. వెంటనే ఆ టీచర్ను ఉద్యోగం నుంచి తొలగించారు కూడా. తమ పాఠశాలలో ముస్లిం విద్యార్థులు అధికంగా ఉన్నందున.. హోం వర్క్ లో భాగంగా అలా పొరపాటు జరిగినట్లు చెప్పుకొచ్చారు.

**బండి సంజయ్ నిలదీత..**

మరోవైపు ఈ ఘటనపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సురా ఫాతిహా హోంవర్క్ ఇవ్వడం ఏంటని నిలదీశారు. ఇది హిందూ సంస్కృతి పై దాడిగా అభివర్ణించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సెక్యులర్ వాదులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజం మొత్తం దీనిని ఖండించాలని డిమాండ్ చేశారు. అయితే ఇప్పుడు ఈ హోం వర్క్ వివాదం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో సెగలు రేపుతోంది.

# బిజెపి 'దళిత' వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ పై బిజెపి ప్రత్యేకంగా గురి పెట్టింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ సీట్లను పెంచుకోవాలని చూస్తోంది. బెంగాల్ తర్వాత తదుపరి వ్యూహం తెలంగాణ అని హైకమాండ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా కార్యాచరణ మొదలుపెట్టింది భారతీయ జనతా పార్టీ. అందుకుగాను ఏ ఒక్క అవకాశాన్ని కూడా జారవిడుచుకోకూడదని భావిస్తోంది. ఒక ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. ప్రధానంగా రిజర్వుడు నియోజకవర్గాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. రిజర్వ్డ్ నియోజకవర్గాలపై దృష్టి పెడితే కచ్చితంగా అధికారంలోకి రాగలమని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునివ్వడం విశేషం.

**ఆ సామాజిక వర్గం కీలకం..**

తెలంగాణలో ఎస్సీ సామాజిక వర్గం అధికం. గెలుపు ఓటములను నిర్దేశించే స్థాయిలో ఉంది ఆ సామాజిక వర్గం. 119 స్థానాలకు గాను.. 19 అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్సీలకు రిజర్వు చేయబడ్డాయి. 17 పార్లమెంటు సీట్లలో మూడు స్థానాలు రిజర్వుడు నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఇవి రెట్టింపు కానున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వుడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 14 స్థానాలను గెలుచుకుంది. బిజెపి ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అందుకే ఈసారి గుణపాఠాలుగా మార్చుకొని రిజర్వుడు నియోజకవర్గాల్లో సత్తా చాటాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ.

**ఆ ప్రచారంతో ప్రజల్లోకి..**

ఎస్సీ సామాజిక వర్గ ఓట్లను ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకుంటుంది భారతీయ జనతా పార్టీ. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ఉన్నాయి. అందుకే ఆ వర్గాన్ని తమ వైపు తిప్పుకుంటే తెలంగాణలో అధికారం సాధించడం సాధ్యం అని బిజెపి బలంగా నమ్ముతోంది. అయితే బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది.. రిజర్వేషన్లను మార్చుతుంది అని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోంది. దీనిని తిప్పి కొట్టడం ద్వారా ఎస్సీలకు దగ్గర కావాలన్నది బిజెపి ఆలోచనగా తెలుస్తోంది. జమ్మూ కాశ్మీర్లో ఆర్టికల్ 370 ని రద్దు చేయడం ద్వారానే.. అక్కడ రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు లభించాయని.. రిజర్వేషన్లను కాపాడిన చరిత్ర కేవలం బీజేపీ దేనని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. మరోవైపు రేవంత్ సర్కార్ మూసి సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో పేద దళితుల బస్తీలను తీవ్రంగా నష్టపరుస్తోందని.. వారికి పునరావాసం కల్పించడంలో విఫలమైందన్న విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బిజెపి ప్లాన్ చేస్తోంది.

**పక్కా రోడ్ మ్యాప్..**

రాబోయే రోజుల్లో ఎస్సీ నియోజకవర్గాల్లో జెండా ఎగురు వేయడానికి బిజెపి పక్కా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బూత్ స్థాయి నుంచి ఎస్సీ మోర్చా కార్యకర్తలను యాక్టివ్ చేయడం, ప్రతి దళిత వాడలోనూ స్థానిక సమస్యలపై పోరాటం చేయడం ఇందులో భాగం. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున లబ్ధిదారులకు చేకూరేలా ఈ క్యాంపెయిన్ కొనసాగించనుంది. మరోవైపు ద్రౌపది ముర్ము, రామ్నాథ్ కోవింద్ లాంటి దళిత, గిరిజన వర్గాలకు అత్యున్నత పదవులు కల్పించిన ఘనత బిజెపి దేనని చాటి చెప్పడం ద్వారా దళితుల్లో నమ్మకాన్ని పెంచుకోవాలని భావిస్తోంది తెలంగాణ బిజెపి. ఆపై మంద కృష్ణ మాదిగ లాంటి వారి సేవలను వినియోగించుకొని ముందుకెళ్లాలని చూస్తోంది. మొత్తానికి అయితే బిజెపి భారీ స్కెచ్ తోనే ఉంది.

# సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్

**జీవితకాలపు పొదుపు కోల్పోతున్న అనేక కుటుంబాలు**

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్షలో డిజిపి ఆనంద్**

హైదరాబాద్: సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్ అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వీటిని ఇప్పుడే నియంత్రించక పోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాలతో కుటుంబాలు జీవితకాల పొదుపు కోల్పోతున్నారని పేర్కొన్నారు. గురువారం డీజీపీ కార్యాలయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పని తీరుపై ప్రశంసలు కురిపించారు. సైబర్ ల్యాబ్, ఎస్ఒసి , డిజిటల్ ఫోరెన్సిక్, సోషల్ మీడియా యూనిట్లను ఆయన పరిశీలించారు. 2025లో సైబర్ మోసాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం జరిగిందని వివరించారు. అయితే 2024తో పోలిస్తే నష్టాల్లో 20శాతం తగ్గుదల నమోదు అయిందని చెప్పారు. దేశవ్యాప్తంగా నమోదైన సైబర్ ఎఫ్ఐఆర్‌లలో 44 శాతం తెలంగాణలోనే నమోదు అయిందని చెప్పారు. రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు బాధితుల నిధుల రక్షణ పెరిగిందని అన్నారు. ప్రతి నాలుగు ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్‌లలో ఒకటి సైబర్ నేరానిదే అని స్పష్టం చేశారు. ఏఐ, డేటా అనలిటిక్స్‌తో సైబర్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు కాల్ చేయాలని బాధితులకు సూచించారు. ఓటీపీ(క్షిఖ)లు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు డీజీపీ సి.వి.ఆనంద్ హెచ్చరించారు. సేఫ్ సిటీతో హైదరాబాద్‌కు మరింత భద్రత ఉంటుందని డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళల భద్రతతోపాటు రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.

# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

## బోర్డు పరీక్షలకు పునాది వేసే మధ్యంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య

న్యూఢిల్లీ: 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.









# ఆర్టీఏ చట్టానికి తూట్లు పొడుస్తున్న శేరిలింగంపల్లి తహసిల్దార్

ఖాజా గూడా లోని ఒక ప్రభుత్వ భూమి వివరాలు అడిగితే వెల్లడించేందుకు నిరాకరించిన వైనం

ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం... కబ్జాదారుడికి వెన్నుదన్నుగా నిలుస్తోన్న రెవిన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిలో హై రైజ్ బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చేలా ఎన్వోసీ జారీ చేసింది ఎవరు?



రెవెన్యూ అధికారుల అండదండలు లేకుండానే ప్రభుత్వ భూమి, రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తుల పేరిట ఎలా చేరింది??

ఖాజా గూడా లోని ప్రభుత్వ భూమికి ఎలా రెక్కలొచ్చి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందో సమగ్ర ఆధారాలతో రేపటి సంచికలో ప్రత్యేక కథనం...


# అక్రమ వెంచర్‌లో ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్లా?

హవ్వ... ఇదెక్కడి విడ్డూరం!

## బడంగ్ పేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు చూసి విస్తుబోతున్న జనం

## బాలాపూర్ సమీపంలో భారీ రియల్ వెంచర్ ఏర్పాటు...

## హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి నుంచి పర్మిషన్ నిల్



పంచా యితీలు ఎప్పుడో రద్దు ...

అయినా ఇప్పటికి పంచాయితీ పాలకవర్గం అనుమతులతోనే వెంచర్ ఏర్పాటా?

అయినా పట్టించుకోని హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి అధికారగణం

ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వహకులతో మిలాఖతయిన అధికారులు?

కాంత మోనికుంట కాలువను సైతం కబ్జా...

కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ( హెచ్ఎండిఏ ), జిహెచ్ఎంసి, తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా ) నుంచి ఎటువంటి అనుమతులు లేని ఓ రియల్ వెంచర్లోని ఇళ్ల స్థలాలకు బడంగ్పేట్ మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ వెంచర్ ఎప్పుడో వేశారనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. బడంగ్పేట్ మున్సిపల్ పరిధిలోని బాలాపూర్ సమీపంలో ఇటీవలే 20 ఎకరాల విస్తీర్ణంలో కాంత మోనికుంట ను అనుకుని సర్వే నెంబర్లు 88 నుంచి 90 వరకు అలాగే 272, 273, 275, 276, 277, 278 తో పాటు 281 వరకు విస్తరించిన భూమిలో రియల్ వెంచర్ ఏర్పాటు చేశారు.

అయితే ఈ వెంచర్ ను ఇప్పటికీ గ్రామపంచాయతీ పాలకవర్గం ఇచ్చిన అనుమతులతోనే ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. గతంలోని ఒక పంచాయతీ పాలకవర్గం ఈ వెంచర్ కు అనుమతులు ఇచ్చినట్లుగా రియల్ ఎస్టేట్ యాజమాన్యం ఫోర్జరీ పత్రాలను సృష్టించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ రియల్ వెంచర్ కు ఇప్పుడు మళ్లీ కొత్త హంగులు దిద్ది కొనుగోలుదారులను నిలువునా ముంచే ప్రయత్నాన్ని రియల్ ఎస్టేట్ యాజమాన్యం చేస్తోందన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఎటువంటి అనుమతులను పొందకుండానే భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు ద్వారా యాజమాన్యం ప్రభుత్వ ఆదాయాన్ని పెద్ద ఎత్తున గండి కొడుతోందన్న విమర్శలు లేకపోలేదు. హెచ్ఎండి, జిహెచ్ఎంసి నుంచి రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు కోసం అనుమతులను పొందాలంటే కచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి నిబంధనలను పాటించి వెంచర్ ఏర్పాటు చేసినట్లయితే పెద్ద ఎత్తున ప్రజాపయోగార్థం స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఫీజు రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని భావించిన రియల్ ఎస్టేట్ యాజమాన్యం గతంలో పంచాయితీ పాలకవర్గం అనుమతులు ఇచ్చినట్లుగా తప్పుడు పత్రాలతో ఇప్పుడు కొత్తగా వెంచర్ ఏర్పాటు చేస్తూ, ప్లాట్ కొనుగోలుదారుల నెత్తిన కుచ్చుటోపి పెట్టే ప్రయత్నాన్ని చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# భోగాపురం నుంచి ఎగరనున్న విమానాలు!

(మొదటి పేజీ తరువాయి)

కీలక అప్డేట్ వచ్చింది. మరో నెల రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కేంద్ర హోంశా ఖ భోగాపురం ఎయిర్ పోర్టును ఇమిగ్రేషన్ చెక్పోస్ట్ గా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో అంతర్జాతీయ విమాన సర్వీసులకు మార్గం సుగమం అయింది. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకంగా మారనుంది.

**పీఎంవో నుంచి అనుమతి..**

ఏపీ విభజన హామీల్లో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటయింది. దీనికి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టు నామకరణం చేశారు. మరో నెల రోజుల్లో విమాన కార్యకలాపాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వయంగా ప్రకటించారు. ఉడాన్ 2.0 పథకం అమలుపై నిర్వహించిన వర్క్ షాప్ తర్వాత రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని.. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ ఓపెనింగ్ తేదీ ఖరారైన వెంటనే ప్రారంభోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. విమాన సర్వీసులు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు.

**హోం శాఖ ప్రత్యేక గుర్తింపు..**

మరోవైపు భోగాపురం ఎయిర్పోర్ట్ కు ఇటీవల కేంద్ర హోంశాఖ గుర్తింపు కూడా లభించింది. ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025 పరిధిలోకి ఈ భోగాపురం విమానాశ్రయాన్ని చేర్చుతూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో దేశంలోని కేటగిరి 1 ఇమిగ్రేషన్ చెక్పోస్టుల జాబితాలో భోగాపురం ఎయిర్పోర్ట్ 39వ విమానాశ్రయంగా చోటు దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో భోగాపురం నుంచి నేరుగా ఇంటర్నేషనల్ విమాన సర్వీసులు నడిపేందుకు చట్టపరంగా మార్గం సుగమం అయింది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తర్వాత ఏపీలో ఇమిగ్రేషన్ సేవలు కలిగిన నాలుగో ఎయిర్పోర్టుగా భోగాపురం విమానాశ్రయం నిలవనుంది. విదేశీ ప్రయాణికుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రక్రియలను నిర్వహించేందుకు అవసం˘మైన అన్ని సదుపాయాలు ఈ విమానా( శయంలో అందుబాటులోకి రానున్నాయి.

**అన్ని హంగులతో..**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అత్యాధునిక హంగులతో నిర్మించారు. దాదాపు నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. మూడు వేల ఎనిమిది వందల మీటర్ల పొడవైన రన్వే ఏర్పాటు చేశారు. ఎయిర్ బస్, బోయిన్ వంటి భారీ విమానాలు కూడా సులభంగా ల్యాండ్ అయ్యేలా ఈ రన్వే ను రూపొందించడం విశేషం. రెండు అంతస్తులు 79 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయాణికుల టెర్మినల్ నిర్మించారు. అందులో చెక్ ఇన్ కౌంటర్లు, ఇమిగ్రేషన్, భద్రత తనిఖీలు, బ్యాగేజీ స్క్రీనింగ్, వాణిజ్య స్థలాలు, ఫుడ్ కోర్టులు, సెల్ఫ్ సర్వీస్ కియోస్కోలు వంటి అత్యాధునిక సౌకర్యాలు అందు బాటులో ఉంటాయి.

# మళ్లీ డి లిమిటేషన్ బిల్లు!

**20 నుంచి పార్లమెంట్ సమావేశాలు:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపు మూడు వారాలకు పైగా కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లోనే ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సీరియస్ గా కసరత్తు చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెడతారని ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన రాజకీయ పరిణామాలతో.. పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ ఎన్డీఏ సాధించింది. ఇంకా కొన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఈ రెండు బిల్లులను ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

**పెరిగిన ఎంపీల బలం..:** పశ్చిమ బెంగాల్లో రాజకీయం పూర్తిగా బిజెపి చేతుల్లోకి వచ్చింది. అక్కడ అధికారం చేపట్టిన బిజెపి వైపు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు వచ్చారు. 20 మంది టీఎంసీ ఎంపీలు వేరుశెబిరం ఏర్పాటు చేశారు. ఎన్డీఏ కు మద్దతు ప్రకటించారు. మరోవైపు శివసేన షిండే వర్గంలో ఒక ఆరుగురు ఎంపీలు చేరారు. అటు శరద్ పవర్ నేతృత్వంలోని ఎన్సిపి ఎంపీలు సైతం ఎన్డీఏకు మద్దతు తెలిపేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. దీంతో కీలక బిల్లుల ఆమోదానికి అడ్డంకులను తొలగించుకుని.. తమకు కావాల్సింది ఆమోదం చేయించుకోవడానికి బిజెపి పట్టుదలతో ఉంది.

**కీలక బిల్లుల ఆమోదం..:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులతో సహా పలు కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు ఢిల్లీ వర్గాలు గట్టి ప్రయత్నంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ పై 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, ప్రతిపాదిత సవరణలతో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సవరించిన బిల్లులో లోక్సభ, రాష్ట్ర శాసనసభల సంఖ్యాబలాన్ని 50 శాతం పెంచే నిబంధన ఉండవచ్చని చెబుతున్నారు. ఆపై 30 రోజులకు పైగా నిర్బంధంలో ఉన్న పక్షంలో ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలన్న నిబంధన కూడా 130వ రాజ్యాంగ సవరణ బొిల్లులో ప్రతిపాదించే అవకాశం ఉంది. అన్నింటికంటే కీలకమైన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదానికి కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4
శుక్రవారం
17-7-2026

**మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి.**

# దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు !

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ

నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

**రాత్రి పది గంటలు దాటిన వేళ, దైనందిన జీవితపు హడావుడి సద్దుమణిగిన క్షణాన, ఇంటి మిద్దెపైకి వచ్చి అనంతమైన ఆకాశం వైపు చూస్తే, ఆ నిండు చంద్రుడు మనతో ఏదో ఆత్మీయ సంభాషణ చేయాలనుకుంటున్నట్టు ఒక అనిర్వచనీయమైన భావన కలుగుతుంది. కానీ ఆ నిశాచరుడు మాట్లాడడు. కేవలం మౌన సాక్షిగా వీక్షిస్తూ ఉంటాడు. మనం ఏం చేస్తున్నామో, ఏ స్థితిలో ఉన్నామో పట్టించుకోకుండానే, తన నిర్దేశిత కక్ష్యలో తాను నిశ్శబ్దంగా వెలుగులు విరజిమ్ముతుంటాడు. ఈ గాఢ నిశ్శబ్దమే, ఈ అనంత దూరమే మానవ హృదయంలో ఒక విచిత్రమైన, సున్నితమైన భావోద్వేగాన్ని రేకెత్తిస్తుంది. అదే మనఃఫలకంపై తిష్టవేసే ఏకాంతం లేదా ఒంటరితనం.**

# వెన్నెల కురిపించే ఏకాంతం!



చంద్రుడిని చూసినప్పుడు మానవుడికి ఒంటరితనం గుర్తుకు రావడం అనేది ఏ ఒక్క సంస్కృతికో, ప్రాంతానికో పరిమితమైన భౌగోళిక విషయం కాదు. చారిత్రక తెలుగు సాహిత్యంలో ఎందరో ప్రసిద్ధ కవులు చంద్రుడిని విరహానికి, వియోగానికి, ప్రేమికుల తపనకు ఒక సజీవ ప్రతీకగా అద్భుతంగా మలిచారు. ప్రియురాలి సామీప్యం కోసం తపించే విరహోత్కంఠుడైన ప్రియుడు జాబిల్లిని చూసి ఆవేదన చెందడం, దూరతీరాల్లో ఉన్న ప్రేమికులు ఒకే చంద్రుడిని వీక్షిస్తూ తమ మధ్య ఉన్న భౌతిక దూరాన్ని మానసికంగా తగ్గించుకోవాలని ప్రయత్నించడం వంటివి మన సాహిత్య ప్రక్రియల్లో పదే పదే ఆవిష్కృతమయ్యే భావచిత్రాలు. అంతర్జాతీయ ఆంగ్ల కవిత్వంలో సైతం "లోన్లీ మూన్" అనే పదబంధం విస్తృతంగా చలామణీలో ఉంది. దీన్నిబట్టి చంద్రుడు, ఒంటరితనం అనే మానసిక భావనతో ముడిపడటం అనేది విశ్వజనీనమైనదని, మానవ మనస్తత్వ శాస్త్రంలో లోతుగా పాతుకుపోయిన ఒక సార్వత్రిక అనుభవమని స్పష్టమవుతోంది.ఈ విధమైన మానసిక స్థితి వెనుక కొన్ని బలమైన కారణాలు ఉన్నాయని అటు మానసిక శాస్త్రవేత్తలు, ఇటు సాహిత్య విమర్శకులు లోతుగా విశ్లేషిస్తున్నారు. మొదటి కారణాన్ని పరిశీలిస్తే, చంద్రుడు రాత్రివేళల్లో మాత్రమే అత్యంత ప్రకాశవంతంగా దర్శనమిస్తాడు. రాత్రి అనేది సహజంగానే మానవాళి విశ్రాంతి తీసుకునే సమయం. బాహ్య ప్రపంచపు ఒత్తిళ్లు, కర్తవ్యాలు ముగిసి, మానవ మేధస్సు అంతర్ముఖమయ్యే వేళ ఇది. పగలంతా యాంత్రిక జీవనంలో మునిగితేలిన మనం, రాత్రి నిద్రపోయే ముందు ఏకాంతంలో ఉన్నప్పుడు మాత్రమే మన లోపలి ఆలోచనలు, సుప్తచేతనావస్థలోని భావాలు మనల్ని చుట్టుముడతాయి. సరిగ్గా అదే సమయంలో ఆకాశంలో చంద్రుడు సాక్షాత్కరిస్తాడు. కాబట్టి చంద్రుడు, మన ఏకాంత క్షణాలతో అప్రయత్నంగానే పెనవేసుకుపోతాడు.రెండో కారణం చంద్రుడి భౌతిక ఉనికికి సంబంధించింది. విశాల ఆకాశంలో నక్షత్రాలు కోట్లాదిగా ఉన్నప్పటికీ, అవి పరిమాణంలో చిన్నవిగా, మసక వెలుతురుతో కనిపిస్తాయి. కానీ చంద్రుడు మాత్రమే అద్వితీయంగా, స్పష్టంగా, తనదైన శీతల వెలుగుతో నడిఆకాశంలో నిలబడి ఉంటాడు. ఈ దృశ్యమాన చిత్రం అనంతమైన చీకటి ఆకాశంలో ఒంటరిగా వెలుగుతున్న ఒక గ్రహం మనుషులలోని ఒంటరితనాన్ని ప్రతిబింబిస్తుంది. సాంఘిక జీవులమైన మనం కూడా ఈ సువిశాల ప్రపంచంలో, ఎంతమంది జనం మధ్య ఉన్నప్పటికీ, అంతర్గతంగా మనల్ని మనం ఒంటరిగా భావించే క్షణాలు ఎదురవుతూనే ఉంటాయి. చంద్రుడి ఆ ఏకైక ఉనికి మన అంతరంగంలోని ఆ భావనకే అద్దం పడుతుంది.మూడో కారణం చంద్రుడి అగమ్య దూరం. చంద్రుడు మన కళ్లకు స్పష్టంగా కనిపిస్తాడు కానీ, మన చేతులకు అందనంత దూరంలో ఉంటాడు. దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తూనే చేరుకోలేని ఈ భౌతిక దూరం, మన జీవితంలో మనం కోల్పోయిన ఆత్మీయులను, గడిచిపోయిన మధుర కాలాన్ని నిరంతరం గుర్తు చేస్తుంది. మనం అమితంగా ప్రేమించిన వ్యక్తులు దూరమైనప్పుడు, వారితో గడిపిన క్షణాలు గుర్తొచ్చినప్పుడు, ఆ జ్ఞాపకాలు కూడా ఈ చంద్రుడిలానే అనిపిస్తాయి కళ్లముందు కదలాడుతుంటాయి కానీ భౌతికంగా వాటిని మనం అందుకోలేము. ఈ భావోద్వేగ పోలిక వల్లే చంద్రుడిని చూసినప్పుడు మానవ హృదయం కాస్త బరువెక్కుతుంది.అయితే, ఇక్కడ ఒక ఆసక్తికరమైన వైజ్ఞానిక, తాత్విక కోణాన్ని మనం గమనించాలి. చంద్రుడు నిజానికి విశ్వంలో ఒంటరిగా ఏమీ లేడు. అతడు భూమి చుట్టూ శాశ్వతంగా పరిభ్రమిస్తూ, భూమితో ఒక విడదీయరాని అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నాడు. సముద్రాలలో పోటుపాట్లు రావడం దగ్గర నుండి, భూమి తన అక్షం మీద స్థిరంగా తిరగడం వరకు అనేక భూగోళ ప్రకృతి ధర్మాలు చంద్రుడి గురుత్వాకర్షణ శక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. కాబట్టి చంద్రుడు అనేది ఒక ఒంటరి వస్తువు కాదు అది కేవలం మన మానవ దృష్టికోణంలో మాత్రమే ఒంటరిగా భ్రమలను కలిగిస్తుంది.ఇదే సూత్రం మానవ జీవితానికి కూడా అక్షరాలా వర్తిస్తుంది. మనం కొన్నిసార్లు మానసిక నిరాశలో మనల్ని మనం ఒంటరిగా భావించుకుంటాం. కానీ వాస్తవానికి మన చుట్టూ కుటుంబం, స్నేహితులు, సమాజం, మనల్ని అమితంగా ప్రేమించే ఆత్మీయులు ఎందరో ఉంటారు. కేవలం ఆ నిర్దిష్ట క్షణంలో, ఆ మనోస్థితిలో మనకు ఆ సత్యం గోచరించదు అంతే. చంద్రుడు మనకు ఒంటరితనాన్ని గుర్తు చేయడం నిజమే కావచ్చు, కానీ అదే సమయంలో అతడు మనకు ఒక అద్భుతమైన సాంత్వననిచ్చే సహచరుడిగా కూడా నిలుస్తాడు. జగత్తులో ఎంతమంది ఎక్కడెక్కడ ఉన్నా, అందరూ చూసేది ఒకే చంద్రుడినే కదా. నేను చూస్తున్న ఈ చంద్రుడినే దూరంగా ఉన్న నా ప్రియమైనవారు కూడా ఇప్పుడు చూస్తూ ఉండవచ్చు అనే ఒకే ఒక్క ఆలోచన మానవ హృదయాల మధ్య బంధాన్ని బలపరిచి, ఒంటరితనం కలిగించే ఆవేదనను కాస్త తగ్గించే ఒక సున్నితమైన భావనగా మారుతుంది.సమగ్రంగా చెప్పాలంటే, చంద్రుడు ఒంటరితనాన్ని ప్రతిబింబిస్తాడు అనేది పాక్షిక సత్యం మాత్రమే. కానీ అదే చంద్రుడు మనకు ఓదార్పునిచ్చే, పాత జ్ఞాపకాలను తట్టిలేపే, కమనీయమైన కవిత్వాన్ని పుట్టించే ఒక అందమైన ప్రకృతి స్నేహితుడు. ఒంటరితనం అనేది ఎల్లప్పుడూ బాధాకరమైనదిగా భావించాల్సిన అవసరం లేదు. అది కొన్నిసార్లు మనల్ని మనం ఆత్మపరిశీలన చేసుకునే, మన అంతరంగాన్ని మనం అర్థం చేసుకునే ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. కాబట్టి, మరుసటిసారి రాత్రిపూట ఆకాశంలో చంద్రుడిని చూసినప్పుడు, అతడు మీకు ఒంటరితనాన్ని కాదని, మీ లోపలి ప్రశాంతమైన నిశ్శబ్దాన్ని, మీ మధుర జ్ఞాపకాలను, మీ మనసు లోతుల్లోని సున్నితమైన భావాలను గుర్తు చేస్తున్నాడని భావించండి. అప్పుడు ఆ వెన్నెల మరింత అందంగా, ఆత్మీయంగా సమ్మోహన పరుస్తుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రాల సెట్లలోని 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయని సీబీఐ తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు వివరాలను ప్రత్యేక కోర్టుకు వెల్లడించింది.ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో సీబీఐ పలు కీలక ఆధారాలను ప్రస్తావించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ÷ుం) ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడైన పీవీ కులకర్ణి నుంచి నీట్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు శివరాజ్ కుమారుడు హాజరయ్యాడని పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా శివరాజ్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో 36 ఫొటోలు లభించినట్లు సీబీఐ తెలిపింది. వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉండగా.. అందులో 111 ప్రశ్నలు నీట్ యూజీ 2026 మాస్టర్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు వెల్లడించింది. రసాయన శాస్త్ర ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ నిందితుడు రాసినవేనని తాము భావిస్తున్నట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు ఈ ఫొటోలు తీసినట్లుగా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేయగా.. వారందరూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు సీబీఐ తెలిపింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నీట్- ప్రశ్నపత్రం లీక్ కేసులో సీబీఐ ఢిల్లీ కోర్టుకు కీలక వివరాలు వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ మోటెగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 136 చేతిరాత ప్రశ్నల్లో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన క్వశ్చన్ పేపర్ సెట్‌తో సరిపోలినట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది.లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ నిర్వహిస్తున్న శివరాజ్ మోటెగావ్‌కర్, 'మోటెగావ్‌కర్ సర్స్ ఆర్‌సీసీ' పేరుతో సుమారు 1.68 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. అతను ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను సీబీఐ పరిశీలించగా, అందులో కెమిస్ట్రీకి సంబంధించిన 132 చేతిరాత ప్రశ్నలు ఉన్న 36 ఫొటోలు లభించాయి. వాటిలో ఐదు ఫొటోలు ఒకే విధంగా ఉండగా, మిగిలిన ఫొటోల్లో ఉన్న చేతిరాత ప్రశ్నలు శివరాజ్ మోటెగావ్‌కర్ రాసినవేనని సీబీఐ భావిస్తోంది. సీబీఐ దర్యాప్తు ప్రకారం.. మే 3న జరిగిన నీట్-యూజీ 2026 పరీక్షకు దాదాపు 10 రోజుల ముందే, అంటే ఏప్రిల్ 23న శివరాజ్ మోటెగావ్‌కర్‌కు లీకైన ప్రశ్నలు అందినట్లు తెలుస్తోంది.

# జిల్లా ఔషధ గిడ్డంగిపై డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

## వర్షాకాల వ్యాధులకు అవసరమైన మందులు సమృద్ధిగా నిల్వ ఉంచాలి

## అన్ని ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో సరఫరా చేయాలని ఆదేశం



**మంచిర్యాల, జూలై 16 (క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మందులు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. గురువారం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ రావుతో కలిసి మంచిర్యాలలోని జిల్లా ఔషధ గిడ్డంగి (సెంట్రల్ డ్రగ్ స్టోర్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మాతా-శిశు సంరక్షణ కేంద్రం, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ ఆసుపత్రులకు అవసరమైన 352 రకాల మందులను జిల్లా ఔషధ గిడ్డంగి ద్వారా సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, సరఫరా విధానాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. మందుల నిల్వలు, గడువు తేదీలు పాము, కుక్క, తేలు కాట్లకు సంబంధించిన అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని ఆరోగ్య కేంద్రాలకు మందులను పంపిణీ చేయడంతో పాటు అత్యవసర మందులు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి మందు నిల్వ వివరాలను నమోదు చేస్తూ రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, జ్వరాలు, అతిసారం, వాంతులు, విరేచనాలకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా నిల్వ ఉంచాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ నిర్ధారణ కిట్లను అన్ని ఆరోగ్య కేంద్రాలకు వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. మందుల రవాణా కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్స్, ఆర్‌బీఎస్‌కే వాహనాలను వినియోగించుకోవాలని, రూట్‌వైజ్ యాక్షన్ ప్లాన్ రూపొందించి దాని ప్రకారం సరఫరా నిర్వహించాలని సూచించారు. తనిఖీ అనంతరం గిడ్డంగిలోని అన్ని విభాగాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ శ్ శ్రీవాణి, ఫార్మసీ ఆఫీసర్లు చంద్రయ్య, శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా విభాగం అధికారులు శ్రీనివాస్, రవికిరణ్, సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది పాల్గొన్నారు.


# కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలో ఘనంగా జగన్నాథ రథయాత్ర

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ పరిధిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా జరిగిన జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్వామి వారి రథాన్ని లాగి యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. రథయాత్రకు ముందు ఉత్సవ మూర్తులకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. గోవింద నామస్మరణలు, భజనల మధ్య కాలనీ వాసులు, భక్తులతో కలిసి రథయాత్రలో ఆయన ఉత్సాహంగా అడుగులు వేశారు. భక్తుల కోలాహలంతో టీఎన్‌జీవోస్ కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ సాక్షాత్తు ఆ పూరీ జగన్నాథ స్వామి వారి రథాన్ని లాగే అదృష్టం దక్కడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. నియోజకవర్గ ప్రజలందరి పై ఆ జగన్నాథుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. కాలనీ వాసులు అందరూ కలిసికట్టుగా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇది ప్రజల్లో ఐకమత్యాన్ని, శాంతిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఈ ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీకి, నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనంజయ, టి. ప్రేమ్ గౌడ్, తిరుమల వెంకటేష్ గౌడ్, కాశి గారి యాదగిరి నేత, బొల్లా వెంకటేష్ నేత, ఎల్లప్ప, యాంజల శేఖర్ ఉస్కెమూరి విజయ్ నేత, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, టిఎన్‌జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595



# గోపాల్ రావు కి శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి నాయకులు

### బీజేపీ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తా

### రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధి గోపాల్ రావు

**కూకట్ పల్లి, జూలై 16 (క్రైమ్ మిర్రర్) :** ఇటీవలే రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా నియమితులైన గోపాల్ రావు కి రంగారెడ్డి జిల్లా బిజెపి కోశాధికారి కృష్ణంరాజు, గోపాల్ రావు నివాసంలో గోపాల్ రావు కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ ఈ బాధ్యతను నాకు అప్పగించడం పట్ల బిజెపి పార్టీ నాయకత్వం నాపై ఉంచిన విశ్వాసానికి నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, నా రాజకీయ ప్రస్థానంలో అండగా నిలిచిన ప్రతి నాయకుడు, కార్యకర్త, మిత్రుడు, శ్రేయోభిలాషి, బిజెపి కుటుంబ సభ్యులందరికీ పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే నా రాజకీయ ప్రయాణానికి మార్గదర్శకాలు అని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను బీజేపీ పార్టీకి మరింత చేరువ చేయడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. నాపై విశ్వాసం ఉంచి ఈ గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సేవలో, బీజేపీ పార్టీ బలోపేతంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు శేషయ్య, మాజీ హైదర్ నగర్ బిజెపి అధ్యక్షులు నవీన్ గౌడ్ పాల్గొన్నారు.



# ఇరుకుంట గ్రామపంచాయతీ కార్యాలయం, నర్సరీని తనిఖీ చేసిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

### వనమహోత్సవానికి నర్సరీని సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

**శంకర్‌పల్లి, జూలై 16 (క్రైమ్ మిర్రర్):** శంకర్‌పల్లి మండలంలోని ఇరుకుంట గ్రామపంచాయతీ కార్యాలయం మరియు గ్రామపంచాయతీ నర్సరీని ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించిన ఆయన, అన్ని రికార్డులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే గ్రామపంచాయతీ నర్సరీ నిర్వహణ పూర్తిగా గ్రామపంచాయతీ బాధ్యతేనని పేర్కొంటూ, రానున్న వనమహోత్సవ కార్యక్రమాలకు అనుగుణంగా నర్సరీని అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టడం, సిట్టింగ్, గ్రేడింగ్ వంటి నిర్వహణ పనులను క్రమం తప్పకుండా చేపట్టి, నర్సరీలోని మొక్కలను ఆరోగ్యంగా పెంచేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, నర్సరీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి వనమహోత్సవానికి సిద్ధం చేస్తామని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీఓ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం : సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** గ్రామ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని, కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మార్చాల గ్రామంలో 4 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, గ్రామ ప్రజలందరి సహాయ సహకారాలతో ముందుకు సాగుతానని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు రజిత మల్లేష్, సుమంత రాజశేఖర్, కిషోర్, యాదయ్య, అనురాధ జంగయ్య, అక్షయ విశ్వేశ్వర్, అలివేల జంగమయ్య, స్వాతి బాలరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అత్తాపూర్ డివిజన్‌లో ఓటర్లకు అవగాహన

### హెల్ప్ డెస్క్ ఏర్పాటు, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియలో భాగంగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడలో ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదర్‌గూడలోని పోలింగ్ బూత్ నంబర్లు 217, 218, 235, 236, 237 పరిధిలో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సందేహాలను నివృత్తి చేయడానికి ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను కూడా ఏర్పాటు చేసి ఓటర్లకు విస్తృతంగా సహాయ సహకారాలు అందించారు. ఈ ఓటరు చైతన్య, సహాయక కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ అప్రమత్తత, పర్యవేక్షణలో అత్యంత క్రమశిక్షణతో నిర్వహించబడింది. బూత్ స్థాయిల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓటర్లకు ఫారాల భర్తీపై అవగాహన కల్పిస్తూ బీఎల్‌ఏలు శివరాజ్ గౌడ్, మేడం రాము, ప్రవీణ్ చంద్ , బీఎల్‌ఓలు చంద్రయ్య, లతా, మాధురి, వంశీ, సురేష్లురుగ్గా పాల్గొన్నారు.





## కామ్రేడ్ గంగపురం సుగుణయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**యాదాద్రి భువనగిరి, జూలై 16(క్రైమ్ మిర్రర్ ):** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కామ్రేడ్ గంగపురం సుగుణయ్య దశదిన కార్యక్రమం రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో వారిదశ దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దేశిడి నరేందర్ రెడ్డి, కొండ్రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, పద్మశాలి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చిలుకూరి శీను, వార్డు సభ్యులు సుర పెల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ రమేష్ బాబు, బానోతు కిరణ్ నాయక్, రేవన పెల్లి గోపాల్, వడ్డేపల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బీ నగర్‌లో అక్రమ మద్యం విక్రయాలపై దాడి.. 190 లీటర్ల మద్యం స్వాధీనం



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,జూలై 16:** ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కిరాణా దుకాణంపై పోలీసులు దాడి నిర్వహించి భారీ మొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి క్రైమ్ నెం. 954/2026గా కేసు నమోదు చేసి, తెలంగాణ ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్ 34(ఎ) కింద చర్యలు చేపట్టారు.ఁపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీ నగర్ ఏసీపీ ఎ. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లోని ఓ కిరాణా దుకాణంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న నీలం మహాలక్ష్మి (36), ఎన్‌టీఆర్ నగర్ నివాసిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన సుమారు 190 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఆనంద్ బాగ్ వెంకన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో స్వామి వారికి భక్తులు హుండీలోసమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షం లో లెక్కించారు. 59 రోజులకు మొత్తం 3,87,746( మూడు లక్షల ఎనభై ఏడు వేల ఏడువందల నలభైఆరు రూపాయలు) ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి ,అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు,డా తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్ , హేమంత్ కుమార్, సంజయ్ కుమార్, రత్నాకర్ ,భక్తులు వెంకట చారి , రమేష్,రత్నమాల, గాంధీ, కె వి ఎస్ ప్రసాద్ ,శ్రీదేవి, సూర్యకుమారి, మాధవి,వి సరిత, ప్రతిభ,హరినాథ్ గౌడ్, తులసి చైనా రాణి, అల్లూరి శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీ,పద్మంజలి,మీఅంజుల, వరలక్ష్మి,దివ్య, హర్షిత,శ్రీదేవి, సీతాలక్ష్మి,రామలక్ష్మి ,నారాయణమ్మ, ఎల్లమ్మ, నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి, గంగా,సాయి, తదితర భక్తులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు



**చౌటుప్పల్,జులై 16, క్రైమ్ మిర్రర్ :** పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమే ప్రభుత్వ కుట్రని జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు వేముల నాగరాజు అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాయని, ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే టీసీ, మెమోలు, డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు ఒత్తిడి చేయడం దుర్మార్గమని అన్నారు. దీనివల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అవకాశాలు కూడా విద్యార్థులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం, మరోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అవలంబించడం విద్యార్థి వ్యతిరేక చర్యలేనని అన్నారు. విద్యను హక్కుగా కాకుండా భారంగా మార్చే విధానాలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరింత ఉధృ తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు దాసరి ప్రకాష్, మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు ఇరిగి వరుణ్ తేజ్, మండల నాయకులు మల్లేష్, అరవింద్, సతీష్,నిఖిల్ ,మనీ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు,ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చేరవేయరాదు....**

**బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన...**

**డీఎస్పీ మధుసూదన్ రెడ్డి,సీఐ జి మన్మథ కుమార్**




**చౌటుప్పల్, జులై 16, క్రైమ్ మిర్రర్ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని డి.ఎస్.పి పటోళ్ల మధుసూదన్ రెడ్డి తెలిపారు. యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ పట్టణంలోని కేజీబీవీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ డీఎస్పీ పి.మధుసూదన్ రెడ్డి, సీఐజి మన్మథకుమార్ లు ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థినులకు వ్యక్తిగత భద్రత, క్రమశిక్షణ, విద్య యొక్క ప్రాముఖ్యత, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని, అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే వేధింపులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, ద్విచక్ర వాహనాలపై తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించడం, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలపై విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యపై దృష్టి సారించాలని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని, సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని డీఎస్పీ మధుసూదన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి. మన్మథ కుమార్ , ఎస్సై అజయ్ భార్గవ్ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కంది భవాని, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# దర్గాలో దళారుల దోపిడీని అరికట్టాలి

### అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్



**క్రైమ్ మిర్రర్ హుజూర్ నగర్ (పాలకీడు)**

జాన్ పహాడ్ దర్గా వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్లు, దౌర్జన్యాలు, దళారుల దోపిడి, భక్తులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ గురువారం జాన్ పహాడ్ దర్గా ప్రాంగణంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రాజు రాథోడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద దర్గా 400 సంవత్సరాలు చరిత్ర కలిగిన పవిత్రమైన దర్గా దైవభక్తితో వచ్చే భక్తుల దగ్గర పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లు దళారుల దోపిడీ రోజురోజుకు పెరిగి పోతోందన్నారు. ఈ సమస్య మీద దర్గా ఇన్స్పెక్టర్ నుండి జిల్లా కలెక్టర్ వరకు, వక్ఫ్ బోర్డు సీఈవో చైర్మన్ రాతపూర్వకంగా పత్రాలు ఇచ్చిన ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. అధికారికంగా టెండర్ ప్రక్రియతో, రేట్ల పట్టికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ దర్గా వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్లు, భక్తుల పట్ల అనుచిత ప్రవర్తన, రాబోయే కాలంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని ఉద్యమిస్తామని, దౌర్జన్యాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, అధికారిక రేట్ల పట్టికను ప్రదర్శించాలని, దర్గా వద్ద జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా కోరింది.ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘా నాయకులు నరి నాయక్, మాజీ ఎంపీటీసీ రామారావు, గిరిజన శక్తి మధు నాయక్, కార్మిక జిల్లా అధ్యక్షుడు శేషగిరి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాపోలు నవీన్, అశోక్ నాయక్, రమేష్ నాయక్, పెరుమాళ్ళ సతీష్, మైబెల్లి, సుబ్బు, లక్ష్మీనారా యణ ,మోతీలాల్, భార్గవ్ చారి, ప్రకాష్, బాలు నాయక్ స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

## ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు మాతృమూర్తి శాంతకుమారి మృతి పట్ల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రగాఢ సంతాపం

**కూకట్ పల్లి, జూలై 16(క్రైమ్ మిర్రర్) :** ప్రముఖ వ్యాపార సంస్థ ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు మాతృమూర్తి శాంతకుమారి పరమపదించిన విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ సతీష్ అరోరా తో కలిసి వారు దొరరాజు నివాసానికి వెళ్లి, శాంతకుమారి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దొరరాజుతో పాటు వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాంతకుమారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. శాంతకుమారి మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా, ఆమెను అభిమానించే బంధువులు, మిత్రులు, పరిచయస్తులకు కూడా తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబ విలువలు, ప్రేమాభిమానాలు, మానవీయతకు ప్రతీకగా నిలిచిన ఆమె జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ సతీష్ అరోరా కూడా శాంతకుమారి మృతి పట్ల ప్రగాఢ విచారం వ్యక్తం చేస్తూ, దొరరాజు, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, అభిమానులు, బంధువులు, స్థానిక ప్రముఖులు పాల్గొని శాంతకుమారి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, తాగునీటి సమస్యల నివారణ, ప్రజాపాలన అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్

## జిల్లాలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం

## నాగర్‌కర్నూల్ జిల్లా పురోగతిని వివరించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలు, రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలపై అవగాహన, ప్రజాపాలన కార్యక్రమాల అమలు తదితర అంశాలపై హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, ప్రజా సేవల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాల యంత్రాంగం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొని జిల్లాలో వివిధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే



మండల విద్యాధికారులు (ఎంఈఓలు), ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల నమోదు కోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో జిల్లాలో నమోదు శాతం గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్‌ల ఎంపిక, అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికలు, సూచనలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేస్తున్నామని, రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మార్కెట్ అవకాశాలు ఉన్న పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పారిశుధ్య చర్యలు చేపడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి ప్రతి నెల జిల్లాను సందర్శించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తున్నారని, అందుకు అనుగుణంగా జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు.

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు... అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణం

## విద్యుత్? స్తంభాలు తొలగించకుండా రోడ్డు నిర్మాణం-

## రోడ్డుకు మధ్యలో ప్రమాదకరంగా స్తంభాలు

## వెంటనే తొలగించాలని ప్రజల డిమాండ్?



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్(నేరేడుచర్ల) :** ఒక రహదారి నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కలగాలి కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అదే రహదారి ఇప్పుడు ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. సాధారణంగా విద్యుత్ స్థంభాలు రోడ్డుకు ఇరువైపులా కనిపిస్తాయి. అయితే నేరెడుచర్లలో మాత్రం విద్యుత్ స్తంభాలు ఏకంగా రోడ్డుకు మధ్యలో నిలిచి వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని కమలానగర్- శాంతినగర్ మధ్య రోడ్డుపైన ఉన్న విద్యుత్ స్తంభాలతో వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నది. రోడ్డు వేసిన కాంట్రాక్టర్లు, అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంలో నిర్లక్ష్యం వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు సంబంధిత అధికారులను కోరారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు నిర్మాణం చేయటం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డుపైన బైకులు, ట్రాక్టర్లు,ఆటోలు రాత్రి పగలు తేడా లేకుండా వెళ్తాయి. ఎప్పుడు విద్యుత్ స్తంభాలు ఢీకొని ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాహన దారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో స్తంభాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం**

ఈ పరిస్థితి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ప్రాణాలను పణంగా పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో లేదా పొగమంచు సమయంలో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మాణ సమయంలో సంబంధిత శాఖల అధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

## కూకట్ పల్లి, ప్రశాంత్‌నగర్ డివిజన్లలో బీఎల్ఓల పనితీరుపై సమీక్ష

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచన

**కూకట్ పల్లి, జూలై 16 (క్రైమ్ మిర్రర్) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లు, బీఎల్ఓల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా 249 కూకట్‌పల్లి డివిజన్‌లోని గాయత్రీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కేంద్రాన్ని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు, సవరణ, మార్పులు, కొత్త దరఖాస్తుల స్వీకరణ వంటి ప్రక్రియలు సజావుగా సాగుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు (జీవీఆర్) పాల్గొని, కేంద్రంలో ఉన్న



సౌకర్యాలు, బీఎల్ఓల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమం మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ప్రశాంత్‌నగర్ డివిజన్‌లోని ఏవీబీపీ పురం ప్రాంతంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూడా గొట్టిముక్కల వెంకటేశ్వర రావు (జీవీఆర్) సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలను కలిసి కార్యక్రమం అమలు తీరును తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల స్వీకరణ, వివరాల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని అన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూసుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు



ఉంటే వెంటనే సవరించుకోవాలని ప్రజలకు సూచించారు. బీఎల్ఓలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున, ప్రశాంత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చందర్ రావు, కూకట్‌పల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు మేకల రమేష్, ఆర్. వాసు, ఫాల్గుణ రావు, సతీష్ తదితర కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఓలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత కచ్చితత్వంతో రూపొందించడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# కాటేదాన్ డివిజన్ పరిధిలోని టాటానగర్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

## ప్రత్యేక పూజలు చేసిన కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్


**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కాటేదాన్ డివిజన్ టాటానగర్‌లో జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర సందర్భంగా ముఖ్యఅతిథిగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర సందర్భంగా భక్తుల కోలాహలం, హరేకృష్ణ నామస్మరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో, భక్తుల కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంకీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. స్వామివారికి మహా హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, కిలారి వెంకటరమణ, భీమ, రాయుడు, నరేష్, వీరస్వామి, మోహన్, రిషి, గణేష్, సుధామా, బాపి, బాబు, నీళ్లు, సిద్ధూ, రామ్, పింటూ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# పురాతన నల్ల పోచమ్మ ఆలయాన్ని కూల్చే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

## ప్రజల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలు తగవని అధికారులకు హెచ్చరిక

## మూసాపేట్ చౌరస్తాలో ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు....ఆలయ కమిటీతో సమావేశం

**కూకట్ పల్లి, జూలై 16 (క్రైమ్ మిర్రర్):** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ చౌరస్తాలో ఉన్న అత్యంత పురాతన, భక్తుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై ఆలయానికి సంబంధించిన తాజా పరిణామాలపై వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆలయాన్ని తొలగించే చర్యలకు సిద్ధమవుతున్నారనే సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిందని, ప్రజలు కొంగుబంగారంగా భావించి భక్తిశ్రద్ధలతో కొలిచే అమ్మవారి ఆలయాన్ని కూల్చివేయడం ఏ మాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఇలాంటి పురాతన దేవాలయాలను పరిరక్షించడం ప్రభుత్వంతో పాటు



సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజల విశ్వాసాలకు, మనోభావాలకు గౌరవం ఇవ్వాలి. అభివృద్ధి పనులు అవసరమే అయినప్పటికీ, వాటి పేరుతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదు" అని అన్నారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని, ఆలయానికి ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయాన్ని తొలగించడం కాకుండా, భక్తుల మనోభావాలను గౌరవించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజల విశ్వాసాలతో ముడిపడి ఉన్న దేవాలయాల విషయంలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని కూల్చివేసే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ చరిత్ర, భక్తుల విశ్వాసం, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ పరిరక్షణకు తన వంతు సహకారం అందించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆలయ రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పండాల సతీష్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, ఆలయ ఈఓ మాణిక్ ప్రభు, ఆలయ కమిటీ చైర్మన్ బిక్షపతి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అభివృద్ధి పనులు, ప్రజల ఆధ్యాత్మిక భావాలను సమన్వయం చేస్తూ పరిష్కారం కనుగొనాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**వ్యక్తిగత సమాచారాలను ఇతరులతో పంచుకోవద్దు....**

**రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలి...**

**చదువుపై దృష్టి సారించి లక్ష్యాలను చేరుకోవాలి...**

**చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్**



**చౌటుప్పల్, జూలై 16, క్రైమ్ మిర్రర్ :** విద్యార్థులు చదువు పై దృష్టి సారించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ అన్నారు. గురువారం పంతంగి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ సిఐ ఎన్ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమంను నిర్వహించారు .ఈ కార్యక్రమంలో షీ టీమ్ సేవలు, మహిళల భద్రత, బాలికల రక్షణ, పోలీస్ శాఖ ప్రజలకు మరియు విద్యార్థులకు అందిస్తున్న భద్రతా చర్యల గురించి సీఐ వివరించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను లేదా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు.అలాగే బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన మరియు సామాజిక నష్టాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, బాల్యాన్ని సురక్షితంగా గడపాల్సిన అవసరం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచితులతో సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు ఇతరులతో పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. బాలికల ఫోటోలను అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, మార్ఫింగ్ చేయడం, నకిలీ అకౌంట్లు సృష్టించడం వంటి సైబర్ నేరాల గురించి తెలియజేసి, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యముగా ఉంచుతామని సూచించారు.అదేవిధంగా, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు, ఫిర్యాదు చేసే విధానం, చట్టపరమైన రక్షణ గురించి కూడా వివరించారు. విద్యార్థులు బాధ్యతాయుతంగా మొబైల్ ఫోన్లు వినియోగించాలని, తెలియని లింకులను ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని, తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో భద్రతపై చైతన్యాన్ని పెంపొందించి, సమాజంలో బాధ్యతాయుత ఎదగడానికి దోహదపడతాయని సీఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో మహారాష్ట్ర పోలీస్ అకాడమీ(నాసిక్) అధికారుల స్టడీ విజిట్ ప్రారంభం

గండిపేట(క్రైమ్ మిర్రర్): పోలీసు శిక్షణలో ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి పరస్పరం పంచుకునే లక్ష్యంతో మహారాష్ట్ర పోలీస్ అకాడమీ, నాసిక్కు చెందిన ఔట్‌డోర్ అధికారుల బృందం డీఎస్పీ సంతోష్ గాయకే నాయకత్వంలో మూడురోజులు స్టడీ విజిట్ కోసం ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. ఈ సందర్భంగా బృందం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మర్యాదపూర్వకంగా కలిసింది. వారు తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రొబేషనరీ డీఎస్పీలు, ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లకు అందిస్తున్న బేసిక్ ఔట్‌డోర్ శిక్షణ విధానం, ట్రై నింగ్ కరికులం, సిలబస్, శిక్షణా పద్ధతులు, అమలు విధానాలు అధ్యయనం చేసి, వాటిలోని ఉత్తమ అంశాలను మహారాష్ట్ర పోలీస్ అకాడమీలో అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ స్టడీ విజిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు పర్యటనలో అకాడమీ ఔట్‌డోర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా, డీఎస్పీ కృష్ణ లైజన్ అధికారిగా వ్యవహరించి బృందానికి అన్ని విభాగాలను సందర్శించేలా సమన్వయం చేశారు. అధికారుల బృందం ఉదయం నిర్వహించిన మార్నింగ్ పరేడ్‌ను పరిశీలించి, ట్రై నీలకు అందిస్తున్న ఔట్‌డోర్ శిక్షణ, క్రమ శిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధానాలు, అలాగే అసిస్టెండ్ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్స్, డల్ ఇన్‌స్ట్రక్టర్స్‌లు అనుసరిస్తున్న శిక్షణా ప్రమాణాలను ఆసక్తిగా పరిశీలించారు. ముఖ్యంగా శారీరక శిక్షణ సమయంలో గాయాలు జరగకుండా అనుసరిస్తున్న ఆధునిక భద్రతా పద్ధతులను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. అనంతరం అకాడమీ డాక్టర్ హ్యాంకిన్స్ మ్యూజియంను సందర్శించిన బందం, పోలీసు దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, క్రై మ్‌సీన్ మేనేజ్‌మెంట్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్‌కు సంబంధించిన ప్రయోగశాలలు, ప్రదర్శన విభాగాలను పరిశీలించి వాటి నిర్వహణపై ప్రశంసలు వ్యక్తం చేసింది. సాయంత్రం అకాడమీ యూనిట్ హాస్పిటల్ను సందర్శించిన బందం, వైద్యాధికారి డాక్టర్ రమాదేవితో సమావేశమైంది. ట్రై నీ అధికారులు అకాడమీలో చేరిన మొదటి రోజు నుంచి శిక్షణ పూర్తయ్యే వరకు వారి ఆరోగ్య పర్యవేక్షణ, వైద్య పరీక్షలు, మెడికల్ రికార్డుల నిర్వహణ, అనుసరిస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ గురించి డాక్టర్ రమాదేవి వివరించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ స్టడీ విజిట్‌లో తెలంగాణ పోలీస్యద్ అకాడమీ అమలు చేస్తున్న ఉత్తమ శిక్షణా విధానాలను మహారాష్ట్ర అధికారుల బందం సమగ్రంగా అధ్యయనం చేయనుందని తెలిపారు.

# బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం 650 ఎకరాల భూసేకరణ

**రంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించిన బహదూర్ గూడ రైతులు**

**ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కుంటోందని ఆవేదన**

**రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ మండలం బహదూర్ గూడ గ్రామ శివారులో తీవ్ర ఉద్రిక్తత, ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన బుల్లెట్ ట్రైన్ హబ్ ఏర్పాటు కోసం తమ జీవనాధారమైన భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తోందని వందలాది మంది గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హబ్ ఏర్పాటు పేరుతో దాదాపు వందల సంఖ్యలో ఉన్న రైతు కుటుంబాలకు చెందిన 650 ఎకరాల సాగు భూమిని సేకరించాలని ప్రభుత్వం చూస్తుండటంతో, తాత ముత్తాతల కాలం నాటి భూములను కోల్పోయి రోడ్డున పడతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ బాధను, నిరసనను ప్రభుత్వానికి వినిపించేందుకు వందలాది మంది రైతులు, మహిళలు, కుటుంబ సమేతంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. బాధిత రైతులకు మద్దతుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి గారు రంగంలోకి దిగారు. ఆయన స్వయంగా రైతులతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకుని, సమస్య తీవ్రతను వివరించేందుకు జిల్లా కలెక్టర్‌ను కలిసే ప్రయత్నం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న అధికారిక శంకుస్థాపన కార్యక్రమాల్లో కలెక్టర్ బిజీగా ఉండటం వల్ల సమావేశం సాధ్యపడలేదు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి కలెక్టరేట్ ముందర రైతు ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి బుల్లెట్ ట్రైన్ హబ్‌లు ఏర్పాటు చేస్తామంటే ఊరుకునేది లేదు కలెక్టర్ ప్రస్తుతం సీఎం ప్రోగ్రామ్‌లో బిజీగా ఉన్నందున, మరో రెండు మూడు రోజుల్లో ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్ తీసుకుని కచ్చితంగా కలుస్తాం. బహదూర్ గూడ రైతుల ఆవేదనను, ఈ 650 ఎకరాల భూసేకరణ వల్ల జరిగే నష్టాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు, రైతులకు న్యాయం జరిగే దాకా బీజేపీ తరపున క్షేత్రస్థాయి నుండి కోర్టుల వరకు న్యాయపోరాటం చేస్తాం. బీజేపీ నాయకుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన బలమైన భరోసాతో బహదూర్ గూడ గ్రామస్థులు, రైతులు ఊరట చెందారు. తమ భూములను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా, ఎక్కడి వరకైనా మీతో కలిసి నడుస్తామని, తమ పోరాటాన్ని ఆపేది లేదని రైతులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు, బహదూర్ గూడ గ్రామ పెద్దలు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## నర్కుడ గ్రామంలో ముమ్మరంగా ఓటర్ జాబితా సవరణ అవగాహన

**పాల్గొన్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**

**ఇంటింటికీ తిరుగుతూ ఓటు హక్కుపై చైతన్యం.. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**



గండిపేట(క్రైమ్ మిర్రర్): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగుతోంది. నర్కుడ గ్రామ సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని 1, 2, 5, 8, 9 వార్డులలో స్థానిక నాయకులు, అధికారులు కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ప్రజల్లో విస్తృతమైన చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ స్థానిక ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు ఎంతో విలువైనదని గుర్తుచేశారు. గ్రామంలోని ప్రతి అర్హుడి పేరు కచ్చితంగా ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడం, తప్పుల మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలపై ప్రజలందరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన గడువులోగా దానికి సంబంధించిన అవసరమైన పత్రాలను అధికారులకు సమర్పించాలన్నారు. నర్కుడ గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడమే మా ముఖ్య లక్ష్యంన్నారు. ఈ విస్తృత అవగాహన కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, స్థానిక వార్డు సభ్యులు చురుగ్గా పాల్గొని ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు చౌట రాజు, కనకమామిడి విష్ణు, పర్వతం వినోద్, బుర్కుంటా నాగరాజు , బీఎల్‌ఓలు మల్లీశ్వరి, రవళి, అమృత, శివలీ, స్థానిక నాయకులు తొంట అశోక్, చందానవెల్లి శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, టి. కుమార్ గౌడ్, గణేష్, కుంచ రక్షిత్, నీరటి అశోక్, శ్రీనాథ్, వినోద్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మణికొండలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం

**ప్రజలకు అందుబాటులో బీఆర్ఎస్ హెల్ప్ డెస్క్**



గండిపేట(క్రైమ్ మిర్రర్): భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా మణికొండ, నెక్నాంపూర్ పరిధిలో ఓటర్లకు అవగాహన, సహాయక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఓటర్ల సవరణ అనేది ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన చర్య అని భావించి, స్థానిక బస్తీవాసులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గురువారం బట్టర్ ఫ్లై సర్కిల్, ప్రతిభ స్కూల్ మధ్యలో గల ఓల్డ్ ఏ1 హోటల్ వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు, సాయంత్రం 4:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారు. ఈ ఓటరు సహాయక కేంద్రం నిర్వహణలో మాజీ కౌన్సిలర్లు ఆలస్యం నవీన్, పద్మారావుతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నాంపూర్ ముఖ్య నాయకులు గుట్టమీది నరేందర్, షేక్ ఆరిఫ్, మాల్యాద్రి నాయుడు, బుధోళ్ళ బబ్లు, మంజు, ముత్యాలు, శ్రీనివాస్, బాషా తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద లభించే వివిధ రకాల ఫారాలను ప్రజలకు అందిస్తూ, వాటిని ఎలా పూరించాలో దగ్గరుండి వివరించారు. స్థానికులు ఫారాలు తీసుకోవడానికి, వాటిని పూర్తి చేయడానికి ఇబ్బందులు పడకుండా చూడటమే తమ ముఖ్య ఉద్దేశమని బీఆర్ఎస్ నాయకులు అందె లక్ష్మణ్ రావు, దేవి ప్రియలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఓటరు 2002 నాటి తమ పాత ఓటును లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకోవడం) ఎంతో అవసరం, ఈ ప్రక్రియలో స్థానిక ఓటర్లకు మా వంతు సంపూర్ణ మద్దతు, సహకారం అందిస్తున్నాము. ఈ విధమైన క్రియాశీలక కార్యక్రమాలలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో, సాధారణ ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమని నిర్వాహకులు గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల కాలంలో తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే ముందుకు వచ్చి ఓటు మ్యాపింగ్ చర్యలను పూర్తి చేసుకోవాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## తెలంగాణ సంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

**రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి**

గండిపేట(క్రైమ్ మిర్రర్): భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని, బోనాల వైభవాన్ని చాటిచెప్పే ఆషాఢమాసం బోనాల ఉత్సావాలు చారిత్రాత్మక గోల్కొండ కోటలోని జగదాంభికా మహాంకాళీ ఆలయంలో తొలి బోనం గురువారం సమర్పించారు. ఈ బోనాల ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాలు ఆషాఢమాసంలో అత్యంత వైభవంగా జరుపుకునే రాష్ట్ర పండుగ అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా జరిగే బోనాల్లో మొట్టమొదట తెలంగాణ కుమ్మర్ల బోనం గోల్కొండ జగదాంభిక మహాంకాళీ అమ్మవారికి సమర్పించపడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 19వ శతాబ్ధంలో హైదరాబాద్ జంట నగరాలను కలరా, ప్లేగు వంటి అంటువ్యాధులు ముంచెత్తినప్పుడు ప్రజలు గ్రామ దేవతలను(పోచమ్మ, ఎల్లమ్మ, మహాంకాళీ) అమ్మవార్లను ప్రార్థించి, వ్యాధులు తగ్గిన తర్వాత కృతజ్ఞతగా బోనాలు సమర్పించడం ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఈ ఆచారం కొనసాగుతూ వస్తుందన్నారు. బోనాలు కేవలం పూజలు, మొక్కులకే పరిమితదం కాకుండా ప్రజల మధ్య ఆత్మీయతను పెంచి మన సంప్రదాయాలను సజీవంగా ఉంచుతాయని ఆ జగదాంభిక అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు పడి పాడిపంటలతో అందరు సుఖంగా ఉండాలని అంటువ్యాధులు తలెత్తకుండా అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలతో దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, భద్రతపై రాజీ లేదు

## బాధితులకు సత్వర న్యాయం, నష్టపరిహారం అందించాలి

## జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** సమాజంలో అత్యంత వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, భద్రత, సామాజిక న్యాయం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, హత్యలు, అత్యాచారాలు, సామాజిక వివక్ష ఘటనల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన ఆయన, ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో విచారించి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం, పునరావాసం, ఇతర సంక్షేమ ప్రయోజనాలను ఆలస్యం లేకుండా అందించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, సంక్షేమ కార్యక్రమాల అమలు, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లపోగు వెంకటస్వామి, చిన్నగళ్ల రమేష్, గమ్మకొండ రాములు, వెల్టూరు రేనయ్య, కే. చంద్రర్, బండ పర్వతాలు, మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట పోలీసు సబ్‌డివిజన్ల పరిధిలో నమోదైన ప్రతి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసును సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ప్రస్తుత దశ, ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు పురోగతి, చార్జిషీట్ దాఖలు, నిందితుల అరెస్టులు, కోర్టు విచారణ, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు వంటి అంశాలపై సంబంధిత డీఎస్పీల నుంచి వివరాలు తీసుకున్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ....... ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) -- పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ -- పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను ఈ సందర్భంగా డాక్టర్ మల్లురవి కోరారు. కేసు నమోదు చేసిన తర్వాత దర్యాప్తు నత్తనడకన సాగితే బాధితులకు న్యాయం ఆలస్యమవుతుందని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, విచారణలో జాప్యానికి కారణమైన అంశాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రతి కేసు అత్యంత సున్నితమైనదిగా పరిగణించి చట్టపరమైన చర్యల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం అందించే విషయంలో ఏ శాఖ నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించబోమని, కేసు నమోదు నుంచి తుది తీర్పు వచ్చే వరకు అధికారులు బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డాక్టర్ మల్లురవి సూచించారు. ప్రాథమిక హక్కుల పైన ఎస్సీ ఎస్టీలకు అవగాహన కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం--1989 కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలుకావాలని ఎంపీ పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన గడువుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు మొదటి, రెండో విడత నష్టపరిహారం, పునరావాసం, రక్షణ చర్యలు, న్యాయ సహాయం వంటి అన్ని అంశాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ పౌర హక్కుల పరిరక్షణ చట్టం--1955, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం--1989 ప్రకారం నమోదయ్యే ప్రతి కేసును జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం, పునరావాసం, ఇతర సంక్షేమ సదుపాయాలు సకాలంలో అందేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కమిటీకి సమగ్ర నివేదిక సమర్పించిన అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ...., జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలు, వివక్షకు సంబంధించిన కేసుల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కేసును సున్నితంగా, పారదర్శకంగా విచారిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం--1989 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, కేసు నమోదు నుంచి దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, నిందితుల అరెస్టు వరకు ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, బాధితులకు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల నష్టపరిహారం, పునరావాసం, రక్షణ చర్యలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో పోలీసు శాఖ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ...., జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ......, ఎస్సీ, ఎస్టీల భద్రత విషయంలో రాజీ ఉండదన్నారు. కేసుల పురోగతి, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం, విచారణ ఆలస్యం, బాధిత కుటుంబాలకు అందాల్సిన సహాయంపై పలు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణారెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యదర్శి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి, జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్, డీఆర్డీఓ చిన్న ఓబులేసు, డిప్యూటీ సీఎంఓ గోపాల్ నాయక్, ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరాలి

## పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి





**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరే విధంగా అధికారులు నాయకులు చొరవ తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ూ×=) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 117 మంది లబ్ధిదారులకు 1కోటి 17లక్షల 13వేల 572రూపాయల విలువైన కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిగి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే అనేక కొత్త పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మండలంలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, వారికి తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గత ఏడాది పరిగి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఈ ఏడాది మరో 2,500 ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. పేదలకు మెరుగైన గృహ వసతి కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతోందని, ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల సన్నబియ్యం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతి రైతుకు రైతు భరోసా కింద రూ.6,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా విశేష ప్రయోజనం చేకూరుతోందని, ఇందిరమ్మ జీవిత బీమా పథకం కింద రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సంతు రవిదాస్ జన్మదిన ఉత్సవాల కమిటీ కన్వీనర్ గా మాస శ్రీనివాస్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ మాస శ్రీనివాస్ బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సంతు రవిదాస్ జన్మదిన వేడుకల ఉత్సవాల కమిటీ రాష్ట్రకన్వీనర్ గా నియమిస్తున్నట్లు సోమవారం రోజున ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది . ఈరోజు హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మాస శ్రీనివాస్ కు నియామక పత్రాన్ని బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు మరియు తెలంగాణ బిజెపి ఎస్సీ మోర్చా ఇంచార్జ్ కొల్లూర్ పార్లమెంట్ సభ్యులు మునిస్వామి చేతులమీదుగా నియామక పత్రాన్ని మాస శ్రీనివాస్ కు అందజేయడం జరిగింది నా నియామకానికి కృషి చేసిన బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కాంతి కిరణ్ బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి భువనగిరి పార్లమెంట్ మాజీ ఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను



# శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి 50 వేల విరాళం

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని మైలమ్మ చెరువు దగ్గర ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన వడ్డే ఆంజనేయులు 50 వేల రూపాయలు విరాళంగా కమిటీ సభ్యులకు గురువారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా భక్తి శ్రద్దలతో జీవించాలని మనశ్శాంతిని కలిగి ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తమ్మలి రామచంద్రయ్య, ప్రేమ్ ప్రకాశ్ రెడ్డి, కడుమూరి. బాల్ రెడ్డి, వాడు నెంబర్ మోత్కూర్ వెంకటేష్, భోగం శ్రీశైలం, ఎం రాజయ్య, వి నర్సింలు కడంపల్లి రఘు రాంపూర్, టి వెంకటయ్య, కే మై పాల్, ఎన్ బుచ్చన్న, రమేష్ చారి, ఎల్ నర్సింహులు గౌడ్, వై కృష్ణారెడ్డి,పి కుమార్ బి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారిస్తాం

## పిఆర్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చాలా ఏళ్లుగా అపరిష్కృతంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో పిఆర్‌టియూ సంఘం ముందు ఉంటుందని పిఆర్‌టియూ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్ అన్నారు. 2026--27 సంవత్సరానికి గాను పిఆర్‌టియూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లిలో ప్రారంభించారు. తదనంతరం భిక్షంగౌడ్ మాట్లాడుతూ హెల్త్ కార్డ్స్, పిఆర్‌సి, పెండింగ్ బిల్స్ వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్తూ ఒక్కొక్క సమస్య పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామని ఒకటి రెండు రోజుల్లో హెల్త్ కార్డ్స్ ప్రతి ఒక్క ఉద్యోగికి అందుతాయని, వీలైనంత తొందరలో పిఆర్‌సిని కూడా ప్రభుత్వం ప్రకటించడానికి సంసిద్ధత వ్యక్తం చేసిందని ఈ సమస్యల పట్ల ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన చేతుల మీదుగా సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యశ్రీనునాయక్ అధ్యక్షత వహించగా పిఆర్‌టియూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి, పిఆర్‌టియూ జిల్లా మాజీ అధ్యక్షులు కన్నయ్యగారి కృష్ణారెడ్డి, పిఆర్‌టియూ జిల్లా మాజీ అధ్యక్షులు కన్నయ్య గోవర్ధన్‌యాదవ్, రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాససాగర్, గౌరవ అధ్యక్షులు మాణిక్యంరెడ్డి, పిఆర్‌టియూ శేరిలింగంపల్లి అధ్యక్షులు హనుమంతు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, సుధాకర్, వహీద్ కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు రోహిణి, అల్లవెల్లి, సత్యన్న, చిందం వెంకట్, రవీందర్‌రెడ్డి, సీనియర్ కార్యకర్తలు శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, చంద్రశేఖర్, శ్రీధర్, ప్రకాష్ లింగం తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ డివిజన్‌లో ఇంటింటి ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మణికొండ డివిజన్ పరిధిలోని చిత్రపూరి కాలనీలో ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు, వివరాల ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి పాల్గొని, ప్రతి అర్హుడైన ఓటరు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రజలు బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు , నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏర్పుల కుమార్, లక్ష్మీశ్రీ , నాయకులు శ్రావణ్ కుమార్, పుల్లారావు, స్పందన, తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శుక్రవారం 17-7-2026

# నాలుగేళ్లుగా వేధించిన ఊపిరితిత్తుల సమస్యకు మెడికవర్ ఆసుపత్రిలో శాశ్వత పరిష్కారం

**బ్రోంకోస్కోపీ ద్వారా ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న దంతం, డెంటల్ ఫిక్సర్‌ను విజయవంతంగా తొలగించిన మెడికవర్ వైద్యులు**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నాలుగేళ్లుగా న్యుమోనియా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం, మండలపాడు గ్రామానికి చెందిన సత్యం (60) ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న దంతం దానిని బిగించేందుకు ఉపయోగించిన డెంటల్ ఫిక్సర్‌ను అత్యాధునిక ఫ్లెక్సిబుల్ బ్రోంకోస్కోపీ ద్వారా విజయవంతంగా తొలగించి మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. గత నాలుగేళ్లుగా సత్యం తరచూ న్యుమోనియా, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతూ ఖమ్మం, విజయవాడలోని పలు ఆసుపత్రులను ఆశ్రయించారు. కొందరు వైద్యులు న్యుమోనియాగా చికిత్స చేయగా, మరికొందరు క్షయవ్యాధి (టీబీ)గా భావించి మందులు కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్యంలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. తదనంతరం మెడికవర్ ఆసుపత్రిని సంప్రదించగా, పల్మనాలజీ కన్సల్టెంట్ డాక్టర్ యశస్విని రోగి వైద్య చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాల క్రితం దంతంతో పాటు దానిని బిగించేందుకు ఉపయోగించిన డెంటల్ ఫిక్సర్ పొరపాటున శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల్లోకి వెళ్లిన విషయం రోగి గుర్తు చేసుకున్నారు. వెంటనే నిర్వహించిన సీటీ ఛాతీ స్కాన్లో కుడి ప్రధాన శ్వాసనాళంలో విదేశీ పదార్థం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం డోర్మియా బాస్కెట్ సహాయంతో ఫ్లెక్సిబుల్ బ్రోంకోస్కోపీ నిర్వహించి ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న దంతం, డెంటల్ ఫిక్సర్‌ను విజయవంతంగా తొలగించారు. అనంతరం కుడి ఊపిరితిత్తి దిగువ భాగంలో పేరుకుపోయిన దట్టమైన ఇన్ఫెక్షన్ స్రావాలను పూర్తిగా తొలగించి శ్వాసనాళాన్ని శుభ్రపరిచారు. దీంతో రోగికి వెంటనే ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విని మాట్లాడుతూ చికిత్సకు స్పందించని పునరావృత న్యుమోనియా కేసుల్లో ఫారిన్ బాడీ ఆస్పిరేషన్ అవకాశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. రోగి వైద్య చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించడం వల్లే అసలు కారణాన్ని గుర్తించి విజయవంతంగా చికిత్స అందించగలిగాం అని తెలిపారు. ఈ విజయవంతమైన చికిత్సలో పల్మనాలజీ, రేడియాలజీ, అనస్థీషియా, బ్రోంకోస్కోపీ విభాగాల వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించారు. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్న శ్రీ సత్యం, నాలుగేళ్లుగా తనను వేధించిన సమస్యకు అసలు కారణాన్ని గుర్తించి విజయవంతంగా చికిత్స అందించిన మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ స్వరూప్, మెడికల్ సూపరింటెండెంట్ డా. కిశోర్ పాల్గొన్నారు.

# మణికొండలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు : ఓటర్లకు ప్రత్యేక సహాయం

గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ డివిజన్‌లోని గ్రీన్ లివింగ్ గేటెడ్ అపార్ట్‌మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ (మీడియా, కమ్యూనికేషన్స్) వాసిరెడ్డి నరేష్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఓటర్లకు ప్రత్యేక సేవలు అందించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, ఓటర్లకు ఎన్యూమరేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ హెల్ప్ డెస్క్‌ను నిర్వహించారు. అపార్ట్‌మెంట్ నివాసితులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డుతో ఓటర్ ఐడీ అనుసంధానమైన వారి ఎన్యూమరేషన్ ఫారాలను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో సమర్పించి పూర్తి చేశారు. అలాగే ఆధార్‌తో లింక్ కాని ఓటర్లకు, వారి



సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ మొబైల్ నంబర్లను అందించి, వారిని సంప్రదించి ఆఫ్‌లైన్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపుకునేలా అవసరమైన సూచనలు, సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఎన్నికల సంఘం సూచించిన గడువులోపు ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా గ్రీన్ లివింగ్ గేటెడ్ అపార్ట్‌మెంట్ నివాసితులకు ఎన్నికల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించారు.



# మై హోమ్ అవతార్‌లో పూరి జగన్నాథ స్వామి రథయాత్ర

**పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**

**స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే**

**రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థన**

గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగ్ సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ గేటెడ్ కమ్యూనిటీ హాల్‌లో పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నేడు అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న ఆయన, ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా సాగిన జగన్నాథ స్వామివారి రథయాత్రలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భక్తులతో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో రథోత్సవంలో పాల్గొని, స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు పొందారు. కమ్యూనిటీ హాల్ ప్రాంగణమంతా భక్తుల జయజయధ్వానాలు, ఆధ్యాత్మిక కీర్తనలతో మారుమోగింది. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఆ జగన్నాథుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కుకున్నాను. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, మన అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు అద్భుతంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. అదేవిధంగా, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ నిరంతరం ఆనందంగా, ఆర్థికంగా సుభిక్షంగా జీవించాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఆ జగన్నాథ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ తోడుండాలని ఆయన కోరుకున్నారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో నార్సింగ్ సర్కిల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మై హోమ్ అవతార్ నివాసితులు, జగన్నాథ స్వామివారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# 40 ఏళ్ల రావి వృక్షానికి కొత్త జీవం

**నేలకొరిగిన చెట్టును తరలించి మళ్లీ నాటించిన సింగరేణి అధికారులు**

**'చెట్లను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత' : మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ**

**మందమర్రి,జూలై 15 (క్రైమ్ మిర్రర్):** ఆర్కేపీ సీహెచ్‌పీ ప్రాంగణంలోని హనుమాన్ ఆలయం ఎదుట ఉన్న సుమారు 40 ఏళ్ల వయస్సు గల భారీ రావి వృక్షం నేలకొరిగింది. విషయం తెలిసిన వెంటనే మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్పందించి, చెట్టును తొలగించకుండా మరోచోట నాటి సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సహకారం అందిస్తానని, చెట్లను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.జీఎం ఆదేశాల మేరకు చెట్టును ఆలయం వద్ద నుంచి జాగ్రత్తగా తరలించి, సమీపంలోని సీహెచ్‌పీ మైదానంలో పునర్నాటకం చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ ఎస్‌ఈ చంద్రమౌళి, అటవీ శాఖ అధికారి నవీన్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి హరి, రామకృష్ణ, ఫోర్‌మెన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు సిరాజుద్దీన్, సీతారామారావు, నరేందర్ తదితరులు పాల్గొని చెట్టు తరలింపు, పునర్నాటకంలో సహకరించారు.ఈ సందర్భంగా సీహెచ్‌పీ కార్మికులు, రామకృష్ణాపూర్ పట్టణ ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే స్పందించి, 40 ఏళ్ల వృక్షాన్ని కాపాడేందుకు చొరవ చూపిన మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## వెంకటేశ్వర కాలనీలో పోచమ్మ దేవాలయం వద్ద

# ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



**పెండింగ్ స్లాబ్ పనులు ప్రారంభం**

**బోనాల పండుగ వేళ భక్తులకు తప్పిన ఇబ్బందులు**

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు స్థానికుల ప్రత్యేక కృతజ్ఞతలు**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వెంకటేశ్వర కాలనీలోని పోచమ్మ దేవాలయం వద్ద ఎంతో కాలంగా భక్తులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. రాబోయే బోనాల పండుగను పురస్కరించుకుని, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుండి వేరే చోటికి మార్పించారు. దీనితో పాటు, పోచమ్మ దేవాలయం ముందు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న స్లాబ్ నిర్మాణ పనులను కూడా బోనాల ఉత్సవాల నాటికి పూర్తి చేసేలా ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు వేగవంతం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు, స్లాబ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక ప్రముఖ నాయకుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, మాధవ రెడ్డి, దత్తు, జైపాల్, దేవేందర్ యాదవ్, శివారెడ్డి పాల్గొన్నారు. వారు దేవాలయం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, బోనాల పండుగ నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోచమ్మ ఆలయం వద్ద ఎంతో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, పెండింగ్ స్లాబ్ పనులు వేయిస్తున్నందుకు కాలనీ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు, బస్తీవాసులు మాట్లాడుతూ దేవాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల పండుగ సమయాల్లో తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యను మా ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే ప్రకాష్ అన్న గారి దృష్టికి తీసుకెళ్లగానే తక్షణమే స్పందించి పరిష్కరించారు. బోనాల కార్యక్రమం కోసం స్లాబ్ పనులు కూడా చేయిస్తున్నందుకు మా వెంకటేశ్వర కాలనీ ప్రజల తరపున ఎమ్మెల్యే గారికి ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

## ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్ - కొత్వాల్‌గూడ

# రహదారిపై మృత్యుకూపాలు

**నరకప్రాయంగా మారిన ప్రయాణం**

**వర్షపు నీటితో నిండిన గుంతలు**

**ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి**

**వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ పరిధిలోని అత్యంత కీలకమైన రహదారుల్లో ఒకటైన ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్ నుంచి కొత్వాల్‌గూడ వెళ్లే రోడ్డు ప్రస్తుతం ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలతో చెరువును తలపిస్తోంది. గుంతల నిండా వర్షపు నీరు చేరడంతో ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతిరోజూ వందలాది వాహనాలు, పాఠశాల బస్సులు, అత్యవసర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఐటీ కారిడార్‌కు, విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, స్థానిక ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో సరైన వీధి దీపాలు లేకపోవడం, గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దుస్థితిని గమనించిన స్థానిక నాయకులు స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి, రోడ్డుపై ఉన్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ రోడ్డు మృత్యుకూపంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణించే రహదారిని ఇలా గాలికి వదిలేయడం క్షమించరాని నేరం. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం వాటిల్లక ముందే అధికారులు మేల్కొనాలి. అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన గుంతలను పూడ్చి, రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తక్షణమే స్పందించకపోతే స్థానిక ప్రజలు, వాహనదారులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, రోడ్డు దిగ్బంధం చేపడతామని వారు హెచ్చరించారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.